# రంగనాథ రామాయణం

**లో**తుకుపోయిన కళ్ళతో, చిక్కిపోయిన, శరీరంతో, తెల్ల వెంట్రుకల గెడ్డం తడుముకుంటూ ఆయాసంగా, బాధగా నిట్టూర్చాడు రంగనాథం.

పాళీలు సరిగా పనిచేయని పాతకలాల బీటలుద్వారా చెదిరికారిన నల్లసిరా చేతులతో ముఖం నిమురుకున్నాడు. కాగితాలలో దూర్చిన తల ఎత్తి, కళ్ళు పెద్దవిచేసి, సిరాచేతుల రంగు, చుట్టూ చీకటిలా కనిపించింది. ఒకసారి కళ్ళుమూసి మళ్ళీ కళ్ళు పెద్దవి చేశాడు రంగనాథం.

జమీందారుగారు ఖాళీచేసి ఆఫీసుకు బంగళా అద్దెకిస్తూ మరిచిపోయిన సీతారామ లక్ష్మణుల ఫోటో ఎదురుగా వాడిపోయిన చెమికీ పూలదండలతో వేలాడుతోంది.

భగవంతుడు! కరుణామయుడు!

చిదానందంతో నవ్వుకున్నాడు రంగనాథం.

బంట్రోతు రాముడు అతని చిదానందం చూసి కులుకుతూ ప్రశ్నించాడు.

'ఏంటి బాబూ! ఆలోచిస్తున్నారు?'

ఫోటోలో కండలు తిరిగిన రాముడు, వాస్తవికంగా ఎదురుగా బక్కపలచగా పేదరికపు నరకంలో నీరసిల్లిన రాముడు, రంగనాథం దృష్టిలో మెదిలారు.

"దేవుడి పేరు పెట్టుకున్న నేటి మానవుడి గతి!" మళ్ళీ నవ్వుకున్నాడు రంగనాథం.

ఆయాసంగా లేచి, బీడీ వెలిగించి "పొగ త్రాగరాదు" అనే బోర్డును వెక్కిరించి, వరండాలోకి వచ్చాడు రంగనాథం, బంగళా చుట్టున్న తోటలోని చెట్లు గజిబిజిగా అల్లుకున్నాయి. ఆఫీసరుల హయాంలోకి వచ్చిన జమీందారు తోట దండకారణ్యంలా కనిపించింది.

హడావుడిగా ఆఫీసుకు వచ్చి అరనిమిషం పని చేసిపోయే ఆఫిసరులకు కాని, అస్తమానమూ కాగితాలపైన వ్రాసేస్తూ క్షణం తీరికలేని గుమాస్తాలకు కాని ఆ తోటలోని వాడిపోతున్న ప్రకృతి ఏ విధమైన చైతన్యం కలిగించలేకపోయింది.

బొజ్జలు పెంచుకొని, వికృత రూపాలు పొందుతున్న లావుపాటి వ్యాపారస్తులు ఆఫీసు ఆవరణలో తిరుగుతోంటే రాక్షసుల్లా గోచరించారు.

సొట్ట దవడలతో, బయటపడిన ఎముకలతో, కండలేని శరీరాలతో కుర్చీలలో పళ్ళు బిగించి రాస్తున్న గుమాస్తాలు కోతుల్లా పొడగట్టారు రంగనాథానికి.

"రాముడూ! సీత చాలా ఉత్తమ యిల్లాలు కదూ!" అంటూ రంగనాథం రాములవారి ఫోటోవైపు చూశాడు.

అప్పుడే ఏదో టైపు చేసిన కాగితం తెచ్చిన ఆఫీసులో టైపిస్టు సీతవైపు చూసి రంగనాథం అన్నమాటకు నోరు నొక్కుకుంటూ నవ్వుకొన్నాడు రాముడు.

'ఈ సీత కాదురా!' అనుకున్నాడు రంగనాథం. అనుకుంటూ నవ్వు ఆపుకోలేకపోయాడు.

నారలోంచి తయారైన కనకాంబరం సిల్కు చీర కట్టుకొన్న సీత వయ్యారంగా చూస్తూ ఎదురుగా ఉన్నవారి నవ్వులోని ఆంతర్యం అర్థం చేసుకోలేకపోయింది. ప్రక్కన కూర్చున్న లక్ష్మణరావు టై సర్దుకుని, కాలరు నిగిడ్చి, సీతకేసి నవ్వుతూ 'గుడ్ మార్నింగ్' అన్నాడు.

సునిశితమైన మందస్మితంతో, కృత్రిమ అమాయక స్వచ్ఛవదనంతో, ఆహ్లాదంగా ఒక వెలుగు నవ్వు నవ్వింది సీత.

నీ గడపదగ్గరే కావలి ఉంటానన్నట్లు లీలగా సకిలించాడు లక్ష్మణరావు.

వేసవికాలపు ఎండకు అడ్డుకట్టిన తడికెలు ఆ ప్రదేశానికి ఒక పర్ణశాల ఆకారం యిస్తున్నాయి.

'రాముడూ! నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నావా?" అన్నాడు రంగనాథం. వాడు గత చరిత్ర తల్చుకుంటూ 'పోనీ! ఆ ముండపోతే మరొకటి! మగాడి కేలోటండీ?' కోపంతో మూతిముండిచాడు రాముడు, తన మొదటి భార్య సీతమ్మను ఎవరో ఎత్తుకుపోయాడన్న విషయం తల్చుకుంటూ.

ప్రక్కగదిలో ఏదో గలాటా వినిపించింది.

ఏమిటిరా? రాముడూ! అంటూనే రంగనాథం ఆ గదిలోకి వెళ్ళాడు.

కోతి ఆకారంలో ఉన్న ఒక గుమాస్తా రాక్షసుడి ఆకారంతో ఉన్న ఒక వ్యాపారస్తుడితో దెబ్బలాడుతున్నాడు. ఆఫీసరు దగ్గరకు వెళ్ళి వచ్చేలోపుగా తన టేబులుమీద అతి రహస్య కాగితాలు తన అనుమతి లేనిదే చూసేదని, తన పరిమితి దాటి ప్రవర్తిస్తున్నాడని గుమాస్తా వాదన. చూడలేదంటూ బొంకుతూ అరిచాడు వ్యాపారాస్తుడు.

తీవ్రంగా పెరుగుతున్న ఆ ఘర్షణ రంగనాథం తన మాటలతో ఆపి, సముదాయించాడు.

'ఏమిటీ యుద్దం' చికాకు పడ్డాడు రంగనాథం. ఆఫీసులో వరుసగా కూర్చున్న గుమాస్తా గుంపుల నల్ల తెల్ల తలలు సముద్ర కెరటాల్లా అన్నాయి. అలమరాల్లోని కాగితాల ఫైల్సు కొండల్లా చుట్టూ ఆవరించి నిలుచున్నాయి.

యుద్ధం అయిపోయిన తర్వాత నిశ్శబ్దంలో, మెల్లిగా లేచాడు రంగనాథం ఆరు గంటలు అప్పుడే దాటిందని.

గాలిలో తేలిపోయే పుష్పక విమానంలా, తన తరతరాల ఆస్తి అయిన పాత సైకిలు రాముడు ఎదురుగా తెచ్చి నిలబెట్టేడు.

ఆకలితో నీరసంగా ఆవలిస్తూ అరణ్యవాసం చేసిన మునీశ్వరుడులా, యిల్లు తల్చుకుంటూ భోజనం గురించి లాలాజలం ఊరించుకుంటూ, అమ్ముల పొది, ధనస్సులా ఫైల్సు కట్టలు సైకిలు వెనకాల తగిలించుకుని, యిల్లు చేరాడు రంగనాథం.

కుశలవుల్లాంటి యిద్దరు కవలలు (వీళ్ళు మాత్రం కూతుళ్ళు) తండ్రిమీద భయంతో, తనకే సంబంధమన్నట్లు, రంగనాథాన్ని చూసి నోరు మెదపకుండా పిల్లుల్లా కూర్చున్నారింట్లో.

వారి మౌనం రంగనాథాన్ని చకితుణ్ణి చేసింది.

'అమ్మ ఏదర్రా?' అరిచాడు రంగనాథం ఆకలితో.

"తాతగారింటకి పోయింది నాన్నా! 'కోపంతొ ఏడ్చారు పిల్లలు.

గయ్యాళి భార్యతో ప్రొద్దున కలహం అయిందని జ్ఞప్తికి వచ్చింది. రంగనాథానికి, పుట్టింటికి పోయిన తన మొండి భార్య, సీతామహాలక్ష్మి బహుశా యింక రాదేమో అని అనుమానం కలిగింది.

ఒక చెయ్యి విరిగిపోయిన వాలుకుర్చీ ఇంట్లో సింహాసనంలా ఆహ్వానించింది.

ఏడుస్తున్న కూతుళ్ళను దగ్గరకు తీసుకొని, యింక వీళ్ళని పాలించి లాలించే భారం కూడా తనదేనని వాపోతూ కుర్చీలో కూలబడ్డాడు రంగనాథం.